
ఆ రోజు రోజూ కంటే త్వరగా తెల్లారి నట్లైంది. ఎందుకంటే, ఆ రోజు తెలుగింట కొత్త సంవత్సరాది... ఉగాది... కోకిల కుహుకుహూ రాగాలు, మావిచిగురు, ఉగాది పచ్చడి, కవి సమ్మేళనాలు టక్కున గుర్తొస్తాయి ఉగాది పండుగంటే. పండుగ ముందు రోజు అర్ధరాత్రి నుంచే కొత్త సంవత్సర శుభాకాంక్షలు చెప్పే నా మిత్రుల ఫోన్‌లతో సందడేసందడి. వీలైనంత వరకూ నేనే ముందుగా ముఖ్యులైన మిత్రులకి ఫోన్ చేసి శుభాకాంక్షలు చెప్పి పడుకోవడం నాకలవాటు. కానీ నేనొక రచయితగా, కవిగా రాష్ట్రనలుమూలలా గుర్తింపు కలిగి ఉండడం చేత నన్నెరిగిన సాహితీమిత్రులెందరో సమయంతో నిమిత్తం లేకుండా వాళ్ళకు తోచిన



# ఈ కాలం పిల్లలు

సమయాలలో ఫోన్లు చేస్తూ ఉండడం చేత నాకు ఆ రోజు నిద్రే కరువైంది. అదీకాక ఆ రోజు ఉదయం సంప్రదాయబద్ధమైన ఒక సాహితీ కార్యక్రమం ఉండడం చేత రోజూ కంటే కాసింత ముందుగా లేచి, తయారై సభామందిరానికి వెళ్ళడానికి సిద్ధపడ్డాను.

"ఏమండీ... మధ్యాహ్నం భోజనానికొచ్చేస్తారా? ఆలస్యమవుతుందా?" అడిగింది నా శ్రీమతి సంధ్య ఉగాది పచ్చడి నా చేతిలో వేస్తూ.

"ఆ... వచ్చేస్తాలే" అంటూ ఆమె పెట్టిన ఉగాది పచ్చడిని సేవిస్తూ అన్నాను ముక్తసరిగా.

"మరేం లేదు... మన రాధ మ్యాట్నీ సినిమాకి తీసుకెళ్ళమని ఒకటే పోరు పెడుతోంది. మళ్ళీ సాయంత్రం ట్యూషన్‌కెళ్ళాలట" చెప్పిందామె. పెద్దమ్మాయి రాధకి పదిహేను సంవత్సరాలు. టెన్త్ పూర్తి చేసి ఇంటర్‌లోకి ప్రవేశించింది ఈమధ్యనే.

"సినిమాకా? రోజూ టీ.వీ.లో చూస్తూనే ఉందిగా. ఇంకా థియేటర్ కెళ్ళి చూడాలా? ఐనా... ఎప్పుడూ టీ.వీ.లు, సినిమాలేనా? కాస్త మన సంప్రదాయమైన సాహిత్యం, కళల విలువలు కూడా ఒంటపట్టించుకుంటే మంచిది" అన్నాను నేను.

"అయితే... ఏం చెప్పమంటారు?" అడిగింది సంధ్య.

**చలపాక ప్రకాష్**

"అదెక్కడుంది?" అడిగాను.

"హాల్లో! టీ.వీ. చూస్తోంది" అంటూ "రాధా!... డాడీ పిలుస్తున్నారు" పిల్చింది రాధని సంధ్య.

"ఏంటి డాడీ" అంటూ నా దగ్గరకొచ్చి నిల్చుంది రాధ.

"డాడీ అని సంబోధించవద్దని నీకు ఎన్ని సార్లు చెప్పాను? "లక్షణంగా 'నాన్నగారూ' అని తెలుగులో పిలవలేవూ" కోపంగా అన్నాను.

అదేం పట్టించుకోలేదు రాధ. అప్పుడు చూసాను రాధని... జీన్స్‌ప్యాంట్, టీ షర్ట్ వేసుకున్న ఆమె వస్త్రాలంకరణని. అంతే... నాకింక కోపం ఆగలేదు.



"ఏమిటే రాధా!... ఈరోజు ఎంత ప్రత్యేక మైన రోజో నీకు తెలుసా?" అడిగాను కోపం గానే.

"ఉగాది డాడీ!" అంది అలవాటుగా 'డాడీ' అనే సంబోధిస్తూ.

నేనెంత కోపం ప్రదర్శిస్తున్నా దానికేం పట్ట నట్లు అతి తేలికగా తీసుకోవడంతో నా కోపం మరింత అరికాలినంటింది. అయినా తమా యించుకుంటూ అన్నాను. "ఉగాది అని తెలిసే ఈ టీ షర్ట్, జీన్స్ ప్యాంట్ వేసుకున్నావా? కనీసం తెలుగు సంవత్సరాది కదా... ఈ రోజ న్నా తెలుగు సంప్రదాయం అవలంభించాలనే ఇంగిత జ్ఞానం లేకుండా పోయింది. అసలు నీకు ఈ బట్టలు ఎవరు కొన్నారే?" అడిగాను కోపంగా.

"నేనే ఇష్టపడి మమ్మీ చేత కొనిపించుకున్నా డాడీ" అంది రాధ చాలా మామూలుగానే.

తండ్రితో మాట్లాడుతున్నానన్న భయం ఆమెలో ఏ మాత్రం లేదు. ఒక మిత్రుడితో చెపుతున్న ధోరణే కనిపిస్తోంది. విషయాన్ని నిర్భయంగా చెప్పేసరికి నేను ఇంకేం అనలేక పోయాను. రాధలో నాకు నచ్చే గుణం అదే. తప్పుచేసినా ఎవరి మీదో రుద్దేసే విధంగా కా కుండా నిర్భయంగా, నిజాయితీగా ఒప్పుకునే ఆమె గుణం నా కోపాన్ని చప్పున చల్లార్చేసింది.

ఇంతకీ రాధని ఎందుకు పిలిచానో జ్ఞప్తి కొచ్చేసరికి అడిగాను. "అయిందేదో అయింది గానీ... కనీసం ఈ ఉగాది రోజైనా మన సంప్ర దాయ లక్షణాలను అలవర్చుకో... అది సరే... నేను సాహిత్య కార్యక్రమానికి వెళుతున్నాను. టీ.వీ.లు, సినిమాలు ఎప్పుడూ చూసేవేకదా. నువ్వూ నాతో సాహిత్యసభకి వస్తావా?" అడి గాను.

"వస్తాను డాడీ!" అంది వెంటనే.


నాకు చాలా ఆశ్చర్యమేసింది. సాహిత్య సభ లంటే అయిష్టం ప్రకటించి, ఏదో వంకతో తప్పించుకునే రాధ... అడిగిన తడువుగా ఒప్పే సుకోవడం ఆశ్చర్యమే కదా!

నేను కోపంతో ఉన్నానని ఒప్పుకుందేమో అనిపించింది. ఏమైతేనేం?... మొత్తానికి సాహి త్య కార్యక్రమానికి రావడానికి ఇష్టపడింది. అది చాలు... ఆ తరువాత ఆమె అలవాటు పడి సాహిత్యమంటే ఇష్టపడేంత మార్పు రా వచ్చు" అని మనస్సులో ఆనందపడ్తూ, సంధ్యకి చెప్పి మీటింగ్ హాల్‌వైపు బయలుదేరాం.

మధ్యాహ్నం అయింది. ఉగాది సాహిత్య ఉపన్యాసాలు, కవి సమ్మేళనాలూ పూర్తయిన తరువాత మీటింగ్ హాల్ నుంచి బైటపడ్డాం. రోడ్డు మీదకి వచ్చాకా "ఒరేయ్ రాధా! ఉప న్యాసాలు ఎలాగున్నాయిరా" అడిగాను. రాధని ముద్దుగా ఒరేయ్ అని పిలవడం నాకు అలవా టు. ఎందుకంటే నాకు కొడుకైనా, కూతురైనా వాళ్ళే. 'ముగ్గురొద్దు, ఇద్దరేముద్దు' అనే కుటుం బ సంక్షేమశాఖ వారి ఫ్యామిలీ ప్లానింగ్‌కి కట్టు బడి ఇద్దరు పిల్లలతోనే సరిపెట్టుకున్నాను. ఆ ఇద్దరూ ఆడపిల్లలే కావడం చేత వాళ్ళలోనే కొడుకుని చూసుకుంటూ సరిపెట్టుకునే అల్ప సంతోషిని నేను.

"బాగానే ఉంది డాడీ" అంది రాధ.

"నిజమే చెప్తున్నావా? లేక..." మొహమా టానికి అలా అంటోందని నాకు తెలుసు. అయి నా సాహిత్య కార్యక్రమం అంటే ఓర్పు, సహ నాన్ని పరీక్షించి, అసహనాన్ని కలిగించే సాధ నంగా ప్రచారం కలిగిస్తున్న ఈ కాలంలో సాహి త్య కార్యక్రమాలు బాగున్నాయని, సాహిత్య మంటే ఇష్టపడని ఓ అమ్మాయి మెచ్చుకోవట మంటే ఆశ్చర్యమేమరి.




"నిజమే చెపుతున్నా డాడీ... ప్రసంగాల ద్వారా మన తెలుగులోని తియ్యదనం, గొప్ప తనం తెలుసుకొని, నా మాతృభాష ఇంత గొప్ప దా అనే మమకారం పెరిగేలా చేసింది. కాక పోతే... కవి సమ్మేళనంలో కొన్ని కవితలే విసు గు కలిగించేలా ఉన్నాయి" కుండబద్దలు కొట్టి నట్లు చెప్పింది రాధ. ఆమె చెప్పింది అక్షరాలా నిజమేనని నాకూ అనిపించింది. ఆమెలోని ఆ నిజాయితీ నాకు ఆమెపై మరింత ప్రేమను పెంచి, పెద్దకూతురిపై మమకారం పెంచుకు నేలా చేసింది. అప్పుడు గమనించాను... రాధ చేతిలో గిరాగిరా తిప్పుతున్న వెండి పట్టాని.

"ఏంట్రా రాధా! వెండి పట్టీతో ఆడుకుంటు న్నావా? తప్పుకదూ! ఆడపిల్లలు వెండి పట్టీతో అలా ఆడవచ్చా?" మెత్తగా కసిరాను. రాధ తలదించుకొని వెండి పట్టీతో ఆడటం టక్కున ఆపేసింది. నాకు అప్పుడు ఆలోచన వచ్చింది. "అవునూ... ఒక పట్టీతో ఆడుతున్నావు... ఇంకో పట్టీ ఏది?" అడిగాను.

దానికి సమాధానం చెప్పకుండా తలదించు కుంది. ఒక పట్టీ కాలికుందేమో, రెండోది తెగి పోయిందేమోనని చూసాను. ఊహు. చేతిలో ఉన్న పట్టీ భాగానే ఉంది. మరి ఎందుకు కాలి నుంచి తీసిందో అని రెండు కాళ్లూ చూసాను. రెండు కాళ్ళకీ లేవు" ఒకటి చేతిలో ఉంది. మరి రెండవది ఏమయినట్టు?" అడిగాను.

"ఇందాక మీటింగ్ హాల్‌లోకెళ్ళినప్పుడు పోయింది డాడీ" చెప్పింది 'సిగ్గుపడుతూ'. ఆమె మొహంలో భయపడిన లక్షణాలు నాకు ఏ మాత్రం కనిపించలేదు సరికదా... నవ్వుతూ చెప్తోంది చాలా తేలికగా. అదలా చెప్తుంటే నాకేమనాలో అర్థం కాలేదు.

"మరిందాక అక్కడే చెప్పవచ్చు కదా... అక్కడే వెతికేవాళ్ళం" అన్నాను నేను మామూలు గానే.

"నేనూ ఇంతక్రితమే చూసుకున్నాను డాడీ..." అంది అతి తేలికగా. ఒక ఖరీదైన వస్తువు పోయిందనే దిగులుగాని, భయంగానీ

దానిలో ఏ మాత్రం కనిపించకుండా అంత తేలికగా తీసుకోవడాన్ని నేను జీర్ణించుకోలేక పోయాను. కనీసం ఒక వస్తువు పోయిందని పెద్దవాళ్ళకు చెప్పాలనే భయం, బాధ్యత లేక పోవడం నాకు కోపం తెప్పించింది. అయినా దిగమింగుకున్నాను. కొత్త సంవత్సరం మొదటి రోజు... పండుగరోజు మాటిమాటికీ కోపాన్ని ప్రదర్శించి, వాళ్ళతో ఆనందాన్ని పంచాల్సింది పోయి బాధ కలిగించటాన్ని ఇష్టపడలేకపోయాను. అయినా పోయిన వస్తువు గురించి బాధ పడుతూ కూర్చుంటే ఏం లాభం? పోయింది తిరిగిరాదు కదా! అందుకే దానిని బాధపెట్ట కుండా మౌనం వహించాను. ఏం కాలమో, ఏమిటో!... అదే మా చిన్నతనంలో అయితే ఏం జరిగేదో!!? చిన్నతప్పు జరిగినా పెద్దవాళ్ళు వాతలు పడేటట్లు ఎలా కొట్టేవాళ్ళో...' అనుకో గానే గతంలోని ఒక సంఘటన సినిమా రీలు మాదిరి మనసులో తిరిగింది.

*  *  *


అవి నేను నాలుగవ తరగతి చదువుకుంటున్న రోజులు.

ఆ రోజు స్కూలుకి సెలవు. ఉదయం నుంచీ జోరున వర్షం కురుస్తోంది. ఆ ఇంట్లో ఏ పొయ్యి మాటునో వెచ్చగా చలి కాచుకోవాల్సిన నా చిరుప్రాయం అందుకు విరుద్ధంగా వానలో తడుస్తూ కిరోసిన్ డబ్బా పట్టుకొని వెళ్ళడం బహుశా ఎవరికీ జాలిగొలిపి ఉండదు. ఆ రోజుల్లో పిల్లలు చదువుకోవడమే కాదు - ఇంట్లోకి కావాల్సిన సామాగ్రిని తేవడం కూడా క్రమశిక్షణలో ఒక భాగం. ఆ రోజు మా ఇంటికి దూరప్రాంతం నుంచి చుట్టాలు రావడంతో వర్షం అడ్డంకి కాక, నాకు అదనపు బాధ్యత పడింది. స్కూలుకైతే సెలవు ఉంది గానీ, నా ఒంటికి సెలవు దొరకలేదు. ఇంట్లో అమ్మ తెమ్మన్నవన్నీ తెస్తూనే ఉన్నాను. ఇంట్లో వంటకి కావాల్సినవన్నీ తెచ్చిన తరువాత మళ్ళీ అమ్మ పురమాయించింది. "కిరసనాయిల్ నిండుకుంది. ఐదు లీటర్లు కిరోసిన్ తీసుకురమ్మంటూ"

అప్పటికే చాలాసార్లు వర్షంలో తడుస్తూనే అన్నీ తెచ్చిచ్చిన నాకు కాస్త నీరసం ఆవరించింది. వర్షంలో తడవడం చేతనేమో ఒకటే తుమ్ములు వస్తున్నాయి. 'కాళ్ళునెప్పులు పెడుతున్నాయని నీలిగినా అమ్మ గదమాయించింది. "ఇంటికి వచ్చినవారికి తిండి పెట్టాలంటే ఏమెట్టి వంట చేస్తాం? ఐదు లీటర్లు మొయ్యాలంటే తమ్ముడూ, చెల్లి వల్లకాదు. నువ్వే వెళ్ళి ఈ ఒక్కసారికీ తీసుకురా, ఏం ఫర్వాలేదు" అంది అమ్మ.

ఇంటికి పెద్ద కొడుకుని కదా! నాకీ బాధ్యత తప్పదు మరి. ఈ విషయం ఆ వయస్సులో నాకు తెలియదు. ఉసూరుమంటూ డబ్బా చేత బుచ్చుకొని సన్నగా పడుతున్న వర్షంలో తడుస్తూనే కిరోసిన్ తేవడానికి బయలుదేరాను.

కిరోసిన్ డిపోలో ఉన్న ముసలావిడ కిరోసిన్ పోసింది. నేను కొత్త రెండు రూపాయల కాగితాన్ని మురిపెంగా చూస్తూ ఆవిడ చేతిలో పెట్టాను. అది వర్షపు గాలికి ఎగిరి, షాపు ముందు నీటి ప్రవాహంలో కొట్టుకుపోయింది. దానికా ముసలావిడ 'డబ్బులు తెచ్చిస్తే గానీ కిరోసిన్ డబ్బా ఇవ్వనని మొండికేసింది. ఏం చేయాలో పాలుపోలేదు నాకు. ఇంటికెళ్ళి అమ్మకి ఈ విషయం చెప్తే ఏం అరుస్తుందో అని భయంతో వణికిపోతూ ఆ కాలువ ప్రవాహం లోతట్టు వైపును పరిశీలించుకుంటూ వెళ్ళాను, ఒకవేళ ఏ గట్టుకైనా ఆ రెండు రూపాయల నోటు అతుక్కుపోయి దొరుకుతుందనే ఆశతో. అలా గంట వరకూ వెతికాను గానీ ఫలితం



కనిపించలేదు. అంతలో నేను రావడం ఆలస్యం అయినందుకు కంగారుగా నన్ను వెతుక్కుంటూ మా అమ్మమ్మ రావడం కనిపించింది. జరిగింది ఆవిడకి చెప్పాను. “ఈ విషయం మీ అమ్మకు తెలిస్తే ఊరుకుంటుందా? కయ్యి మని లెగిసిపోదూ... నేనేదో చెప్తాగాని, నా వెనుకనే రా...” అని ధైర్యమిచ్చింది అమ్మమ్మ. భయపడుతూ అమ్మమ్మ మాటున దాక్కుని భయం భయంగా ఇంటికి చేరాను. రెండు రూపాయలు పోయిన సంగతి తెలుసుకున్న అమ్మ కోపంతో ఊగిపోయింది. చేతికందిన కర్రతో చిన్నపిల్లాడి నన్న విషయాన్నే మరిచి గొడ్డుని బాదినట్లు బాదింది. ‘డబ్బంటే నీకంత నిర్లక్ష్యమా?’ అంటూ గుర్తొచ్చినప్పుడల్లా తిట్టింది. “నీకేం మీ నాన్న కష్టపడి పోస్తున్నారు. తిని కూచుంటే డబ్బు విలువ నీకేం తెలుస్తుంది? కష్టపడితే కదా దాని విలువ తెలిసేది?” అని ఏవేవో అంది. అవేమీ అర్థం చేసుకునే వయస్సు కాదు నాకప్పుడు. ఆమె కొట్టిన దానికి వెక్కి వెక్కి ఏడ్చాను. అమ్మ నన్ను కొడుతున్నప్పుడు నన్ను వెనకేసుకొచ్చిన మా అమ్మమ్మకూ అమ్మ కొట్టిన దెబ్బల్లో రెండు తగిలాయి. అయినా అవేమీ లెక్క చేయకుండా అమ్మమ్మ నన్ను పొత్తిళ్ళలో పెట్టుకొని ఓదార్చింది. అలాగే జాగ్రత్తలు చెప్పింది. ఆ కాలంలో తల్లిదండ్రులంటే భయపడి వణికే పిల్లలకు అమ్మమ్మ, నాయనమ్మ, తాతయ్య పడకలే ప్రేమానురాగాలు అందించే పొత్తిళ్ళు. వారి ప్రేమే కొండంత ధైర్యాన్ని, రక్షణనిచ్చే లోగిళ్ళు.

* * *

పాత రోజులు గుర్తుకొచ్చిన నాకు మనసు బరువుతో నిండిపోయింది. అన్ని కష్టాలుపడి, క్రమశిక్షణలో పెరగబట్టే ఈ రోజు తాను, తన పిల్లలూ హాయిగా బ్రతకగలుగుతున్నాం” అనుకుంటూ ఇంటికి చేరాం. అందరం భోజనం చేయడానికి సిద్ధమయ్యాం. మా అమ్మ, నాన్న, నా శ్రీమతి, పిల్లలు అందరూ ఒకరికోసం ఒకరు ఎదురుచూస్తూ, కలిసి భోజనం చేయడం

లోనే మాకెంతో ఆనందం, తృప్తి.

ఆ రోజు ఉగాది పండుగ కావడంతో అందరూ కొత్త బట్టలు ధరించి, కళకళగా కనువిందు చేస్తూ ముచ్చట్లతో సందడి సందడిగా ఉంది. భోజనం చేస్తూ రెండో చేత్తో వెండి పట్టీని గిర గిరా తిప్పుతున్న రాధపై పడ్డాయి అందరి చూపులూ. అది చూసిన నా శ్రీమతి ముందుగా తేరుకొని "ఏమిటే... వెండి పట్టీతో ఆడుతున్నావు? తప్పుకదూ! అయినా కాలికుండాల్సిన పట్టీ ఎందుకు తీసావు?" అరిచింది. అప్పుడు చెప్పవలసి వచ్చింది రాధకి రెండవ పట్టీ పోయిందనే సంగతి.

అంతే... మా ఇంట్లో పెద్ద రాద్ధాంతమే మొదలైంది" అంత భయం భక్తీ లేకుండా, ఒళ్ళు గిళ్ళూ చూసుకోకుండా రోడ్డు మీద ఎలా వెళ్తున్నావే? అసలు నిన్నుకాదు - మీ నాన్నని అనాలి. మిమ్మల్ని అతి గారాభం చేసి నెత్తికెక్కించుకున్నాడు. ఆడపిల్లలన్నాక హద్దు మిద్దు కలిగి ఉండాలి. క్రమశిక్షణతో మెలగాలి. వాడు మీకివి ఏవీ నేర్పలేదు. వందలు పోసి కొన్న వెండి పట్టీ పారేసి ఎంత తేలికగా చెబుతున్నావే... నీకసలు భయం ఉందా? జాగ్రత్త ఉందా? ఏం కాలమో ఇది. ముదనష్టపు కాలం. అదే మా కాలంలో అయితే మా పెద్దవాళ్ళు చీల్చి చెండాడేసే వాళ్ళు" అంటూ ఇంతెత్తున లేచింది మా అమ్మ. ఆవిడకి అరవై ఏళ్ళు వయస్సు దాటినా ఆ పాత కాలపు లక్షణాలు ఏ మాత్రం తగ్గలేదు.

మా అమ్మమ్మ, నానమ్మ మా చిన్నతనంలో ఇటువంటి సందర్భంలో మమ్మల్ని చేరదీసినట్లు ఆమె తన మనవరాళ్లను చేరదీయలేదు సరికదా, మా చిన్నతనంలో మమ్మల్ని ఎలా మందలించేదో అలాగే రాధనీ మందలిస్తుంది. కొట్టడం ఒక్కటే తక్కువ. ఎన్నో మాటలతో రాధని కడిగేసింది.

దానికి రాధ అలిగి, ఏడుస్తూ కూర్చుంటుందనుకున్నాను. కాని అక్కడ అలాంటిదేమీ జరగకపోవడంతో కాస్త తేలికగా ఊపిరి తీసుకున్నాను.

మా అమ్మ మాత్రం అలా దెప్పిపొడుపులతో, ఈసడింపుల దండకాలతో రాధ మీద అరుస్తూనే ఉంది. ఇలాంటి రాద్ధాంతం జరుగుతుందనే పట్టీపోయిన సంగతి ఇంట్లో ఎవరి దగ్గరా ప్రస్తావించలేదు నేను.

నా దగ్గర చనువుగా ఉన్నట్లే పాతకాలపు మనుషుల దగ్గరా చనువుగా ప్రవర్తించడం కుదరదని తెల్సుకోలేని అమాయకురాలు రాధ. జీవితంలో ఇంకా ఎంతో నేర్చుకోవలసిన పిల్ల అది. నిదానంగా చెప్పి దాని వ్యక్తిత్వంలో మార్పు తేవాలి...' నేను మనసులో అనుకుంటూ దానిపై జాలి పడ్డాను. అందరి భోజనాలు పూర్తయ్యాయి. నేను చెయ్యి కడుక్కోడానికి బయటకు వెళ్ళాను. ఒక పక్కగా రాధ, మా చిన్నమ్మాయి శ్రీజా అనుకుంటున్న మాటలు నాకు లీలగా వినిపించాయి.

"ఏమే అక్కా! నానమ్మ నిన్ను అన్నేసి మాటలు అంటున్నా నీకసలు బాధకలగలేదా? సిగ్గు వెయ్యలేదా?" అంది శ్రీజా దెప్పిపొడుపుగా.

"సిగ్గా! ఎందుకే? చిన్నదానికే ఏదో కొండలు తరిగిపోయినట్లు రాద్ధాంతం చేస్తోంది. అసలు ముసలాళ్ళు తిని కూర్చోక, ఏమీ తోచక ఏదో వాగుతూ ఉంటారు. అవన్నీ పట్టించుకుంటే ఎలా? ఈ చెవితో విని ఆ చెవితో వదిలేయాలి..." చెప్పుకుపోతోంది రాధ.

అవాక్కైపోయాను నేను. తన మంచి కోసం అన్ని మాటలంటూంటే అవేమీ పట్టించుకోనక్కర్లేదని తేలికగా తీసిపారేసే ధోరణి నాకాశ్చర్యమేసింది. "ఔరా! ఈ కాలం పిల్లలు..." అని తలపట్టుకోవడం నా వంతైంది. ●